

# భీష్మా... నాతో పోరాడు!

రాధిక

చుట్టూ రాబందులు నా చావు కోసం ఎదురుచూస్తూ వున్నాయి. కొన్ని నాపై వాలి నన్ను పరీక్షిస్తున్నాయి. నాకు కళ్లు తెరవాలని వుంది. కాసేపట్లో వదిలి వెళ్లబోయే ఈ ప్రపంచాన్ని కళ్లారా చూడాలని వుంది.

నా సర్వశక్తులూ కూడతీసుకుని కళ్లు తెరిచి చుట్టూ పరికించాను. సూర్యాస్తమయం అప్పుడే జరిగినట్టు వుందో లేక నాకు చూపు ఆనటం లేదో అన్నీ మసకగా కనపడుతున్నాయి.

చుట్టూ యుద్ధం చేసిన భీభత్సం. తెగిపడిన తలలు, చెల్లాచెదురైన మొండాలు, ధారలుగా పారి గడ్డకట్టిన రక్తం. విరిగిపోయిన రథాలు. కూలిపోయిన ఏనుగులు, గుర్రాలు. పృథ్వి ఇంతవరకు చూడని యుద్ధం. ఎవరినీ విజేతలుగా గాని పరాజితలుగా గాని నిలపని యుద్ధం.

చుట్టూ పరికించాను. ఎవరిదో మూలుగు వినబడుతుంది. కాసేపటిలో రాబోయే చావు కళ్లముందు కనబడుతున్నట్టుంది. పాపం భార్యాపిల్లలు గుర్తువచ్చి వుంటారు. నన్ను గుర్తు చేసుకునేవారుగానీ నా కోసం దుఃఖించేవారుగానీ ఎవరూలేరు. నేను ఎప్పుడో మరణించాను... ఇప్పుడు రాబోయేది భౌతిక మరణం మాత్రమే. నేను ఎవరో మొదటిసారి గుర్తించిన నాటి నుంచి నన్ను తుదికంటా నరికి వెయ్యటానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. ఎన్నో గాయాలు నన్ను బాధించాయి. ఈరోజు అనుభవిస్తున్న శారీరిక బాధ వాటి ముందు దిగదుడుపు.

సన్నటి నీడ పాకుతూ వస్తుంది.

ఎవరో తన వారికోసం వెతుకుతున్నట్లుంది. వచ్చినవాళ్లు ఎవరో తెలుసుకోవాలనిపించింది. శక్తి కూడతీసుకుని తల పైకి ఎత్తి చూపు సారించాను. అంతా మసక మసకగా వుంది. అయినా ఆనవాలు పట్టగలిగాను. తన కొడుకులని విజేతలుగా నిలిపి తన మాతృత్వాన్ని నిరూపించుకున్న కుంతి. అమ్మమాట జవదాటని అయిదుగురు కొడుకులు. యుద్ధం ఆపాలనుకుంటే అది కుంతికి క్షణకాలం కూడా పట్టేదికాదు. కాని ఇంత దారుణాన్ని ఆపలేదు. ద్రౌపదికి కూడా అన్యాయం చేసింది. అయిదుగురితో కాపురం చేయించింది. ఎంత కఠినాత్ముర్రాలు కుంతి.

కోపానికో, చలికో, గాయాల బాధకో శరీరం వణుకుతుంది.

కుంతి సమీపానికి వచ్చింది. ఇప్పుడు కొంత స్పష్టంగా కనబడుతుంది. తెల్లని జుట్టు, దృఢమైన శరీరం. చేతితో గుండెను నొక్కుకుంటూ, మూర్తీభవించిన శోకదేవతలాగా వుంది. రాజమాతని ఆ స్థితిలో చూడగానే జాలితో హృదయం చలించిపోయింది. పాపం కుంతి. చిన్న వయసులోనే కొడుకుకి దూరమై పొంగిపోతున్న చనుబాలను గుండెల్లోకి అదుముకుంటూ ఎంత బాధను అనుభవించిదో. తనకు పుత్రులని ప్రసాదించిన వారితో ఏర్పడిన బంధాన్ని తెంచుకుని రాచ మర్యాద కోసం, తన మాతృత్వాన్ని నిరూపించటం కోసం, రాజ్యంలో తన పుత్రుల వాటా కోసం ఎన్ని త్యాగాలు చేసింది.

ప్రాణం నెమ్మదిగా నన్ను వదలటం నాకు తెలుస్తుంది. ఇన్నినాళ్లు నాదికాని శరీరంలో నాదైన జీవితం గడపటానికి ప్రతి క్షణం పోరాడిన నాకు కొద్దిసేపటిలో

విముక్తి కలగబోతుంది. నా జీవితం, నా అనుభవాలూ, నేను ఎదుర్కొన్న అవమానాలు నా కళ్ల ముందు దృశ్యాలుగా తిరుగుతున్నాయి.

*

నా పుట్టుక నా తల్లిదండ్రులకు పరమానందాన్ని ఇచ్చింది. తొలిచూలులోనే మగపిల్లవాడు పుట్టటం వాళ్ల సంతోషాన్ని రెట్టింపు చేసింది. నన్ను భీష్ముడిని మించిన యోధుడను చెయ్యాలని యుద్ధం జరిగితే భీష్ముడిని నేనే ఓడించాలని నా తండ్రి కలలు కనేవాడు. విలువిద్యలో ఆరితేరి, ఒంటిచేత్తో వెయ్యిమంది వీరులనైనా ఓడించ గలిగే భీష్ముడి గురించి వింటుంటే నాకు ఒడలు పులకరించేది. సుదూరం నుంచి ప్రయోగించే ఆయుధాలు అప్పుడప్పుడే వాడుకలోకి వస్తున్న కాలం అది. అప్పటి వరకు వాడుకలో వున్న ద్వంద్వయుద్ధాలలో శారీరక శక్తి ప్రధానపాత్ర వహించింది. కాని విలువిద్యలో నైపుణ్యం, శక్తియుక్తులు, ఏకాగ్రత ఎంతో ముఖ్యం. అది అందరికీ సాధ్యంకాదు. అందుకే విలువిద్యలో నిపుణుడైన భీష్ముడంటే రాజులందరూ భయపడే వారు.

నా తండ్రి నాకు చిన్నప్పటి నుంచి భీష్ముడి పరాక్రమాల గురించి చెప్పటం వలన నా మనసులో భీష్ముడంటే గురుభావం కలిగింది. ఎప్పటికైనా యుద్ధం జరిగితే, భీష్ముడు ఎదురైతే, భీష్ముడిని మెప్పించటమే లక్ష్యంగా విలువిద్య నేర్చుకున్నాను.

విలువిద్యలో నా నైపుణ్యం చూసి నా తండ్రి ఎంతో సంతోషించేవాడు. అతని ప్రార్థన మన్నించి పరమేశ్వరుడు భీష్ముడంతటి వీరుడిని కుమారుడిగా ప్రసాదించాడు అని చెప్పుకునేవాడు.

కాని నేను ఎదుగుతున్నకొద్దీ తెలియని బాధ నన్ను దహించివేసేది. నేను మిగతావాళ్లకి భిన్నంగా వున్నాను అన్న ఆలోచన నన్ను స్థిమితంగా ఉండనిచ్చేది కాదు. లోపల అగ్నిపర్వతం పేలుతున్నట్టుగా, నాలో ఇంకెవరో వుండి నన్ను నియంత్రిస్తున్నట్టుగా తోచేది. లోపల వున్నవారిని తరిమికొట్టి, అందరివలె వుండటానికి శతవిధాల ప్రయత్నం చేశాను. నాకు అది సాధ్యం కాలేదు.

దాసీ పిల్లల దగ్గర తీసుకున్న దుస్తులు ధరించేదాన్ని, పువ్వులు, పూసలతో ఆడపిల్ల వలె అలంకరించుకునేదాన్ని. నాతోటి బాలికలతో కలిసి ఆటలు ఆడేదాన్ని.

నా తల్లిదండ్రులు నా ప్రవర్తనని పసితనంగా భావించి నన్ను మందలించే వారు. నా స్వభావం పసితనం కాదు, సహజమైనది అని వారికి తెలియటానికి ఎంతో కాలం పట్టలేదు.

ఒకరోజు స్నానం ముగించుకొని వచ్చాను. నా సేవకుడు నా దుస్తుల్ని సిద్ధంగా ఉంచాడు. ఆ దుస్తులు చూసి నేను, "అవి బాలురు వేసుకునే దుస్తులు, నేను బాలికను. నాకు బాలికలు వేసుకునే దుస్తులు కావాలి. వెళ్లి తీసుకొనిరా," అని పురమాయించాను.

అతడు స్థాణువయ్యాడు. నాకు నచ్చచెప్పటానికి ప్రయత్నం చేశాడు. ఆ దుస్తులు ధరించాలనే ఆలోచనే నాకు దుర్భరంగా తోచింది. అతడి మాట వినలేదు. అతడు వెళ్లి నా తల్లిని తీసుకొని వచ్చాడు. ఎప్పటిలాగే అది పెంకితనంగా భావించిన నా తల్లి నాకు నచ్చచెప్పటానికి ప్రయత్నం చేసింది.

"అమ్మా నేను బాలికను. నాకు బాలికలు వేసుకునే దుస్తులే కావాలి. నాకు అవి ధరించాలనే అనిపిస్తుంది. అవి తెప్పించు," నేను చాలా స్థిరంగా చెప్పాను.

బహుశా నేను నేనుగా ఉండటానికి మొదలు పెట్టిన మొదటి యుద్ధం అది. యుద్ధంలో కొంత మందైనా మన తరపున ఆయుధం పట్టేవాళ్లు వుంటారు. కాని నేను చేసే యుద్ధంలో నేను ఒంటరిని. నేను ఒంటరినని తెలియటానికి ఎంతో కాలం పట్టలేదు.

నాది మొండితనంగా భావించిన నా తల్లి, నా తండ్రిని పిలవమని సేవకుడికి పురమాయించింది. నాపై ఎంతో ఆశలు పెట్టుకుని, నన్ను ఎంతో ప్రేమించే నా తండ్రి, విషయం తెలిసి ఆందోళనతో వచ్చాడు. నాకు సర్దిచెప్పటానికి ఇద్దరూ చాలా ప్రయత్నం చేశారు. నేను బాలుడనని, యువరాజునని, నా ప్రవర్తన అలా వుంటే నలుగురూ నవ్వుతారని నన్ను బుజ్జగించారు, భయపెట్టారు, చివరి అస్త్రంగా నన్ను దండించారు. కాని నేను వారి మాట వినిపించుకోలేదు.

నా పట్టుదలతో విసిగిపోయిన వాళ్లు ఒక దాసీ కుమార్తెను పిలవనంపారు. ఆమెను వివస్త్రను కమ్మని ఆదేశించారు. ఆ పిల్ల నా తండ్రి అదేశాన్ని పాటించి తన వంటిపై దుస్తులను తొలగించింది.

"చూడు, బాలిక అంటే ఇలా వుంటారు. నువ్వు వున్నావా? బాలికనని తెలియచెప్పే ఒక్క అంగమైనా నీకు ఉందా. వుంటే చెప్పు నిన్ను బాలికగానే పెంచుతాము. నీకు కావలసిన దుస్తులు, పూసలు. పువ్వులతో నిన్ను అలంకరించమని ఆదేశిస్తాం. సరిగ్గా చూసి చెప్పు," నా తండ్రి కోపంతో చెప్పాడు.

నేను అవమానంతో క్రుంగిపోయాను. స్త్రీయో, పురుషుడో ఎలా నిర్ణయిస్తారు. శారీరిక అంగాలతోనా? మనసు, హృదయ స్పందనలతోనా?

నా హృదయం ఒక స్త్రీది... నా స్పందనలు, వాంఛలు, కోరికలు అలోచనలు అన్ని కేవలం స్త్రీవి మాత్రమే. కాని నా శరీరంతో నన్ను గుర్తిస్తూ నా మనసుని గుర్తించ టానికి నిరాకరించే వీరికి నేను స్త్రీనని ఎలా నిరూపించగలను? నన్ను అక్కున చేర్చుకోవలసిన నా తల్లిదండ్రులే నన్ను గుర్తించ నిరాకరిస్తే లోకానికి నన్ను నేను ఎలా ప్రదర్శించుకోగలను.

నేను కుప్పకూలిపోయాను. నన్ను ఆ స్థితిలో వదిలి అందరూ వెళ్లిపోయారు. నా కళ్ల ముందు ఆ దాసీ నగ్న శరీరం నిలబడి వుంది. నువ్వు బాలికవు కావు అని నన్ను వెక్కిరిస్తున్నట్టుగా వుంది.

నా దుస్తులను తొలగించి నన్ను నేను చూసు కున్నాను. నా అవయవాలని పరికించి చూసుకున్నాను. నాకు పట్టరాని దుఃఖం వచ్చింది. నేనెందుకు ఈ శరీరం లో వున్నాను. నాది కాని శరీరం. నాకు సంబంధం లేని అవయవాలు... నన్ను నేను గోళ్లతో రక్కుకున్నాను. నాది కాకపోయినా నన్ను అంటి పెట్టుకున్న ఈ శరీరాన్ని నాశనం చెయ్యాలని, హింసించాలని ప్రయత్నించాను. శస్త్రవిద్యలు నేర్చుకునేటప్పుడు చిన్న గాయానికే తల్లడిల్లే నా తల్లిదండ్రులు మనసంతా గాయాలతో ఆసరా కోసం ఎదురుచూస్తున్న నన్ను అనాథలా వదిలివేశారు. నన్ను నన్నుగా స్వీకరించటానికి సిద్ధపడలేదు.

ఈ శరీరంలో ఇమడలేక ఆత్మహత్య చేసుకుందా మని ప్రయత్నించాను. అప్పటికే నేను భీష్ముడంతటి వాడినని లోకమంతా చాటించిన, అనుభవజ్ఞుడైన నా తండ్రి అతని ప్రతిష్ట కోసం నేను ఎటూ పారిపోకుండా, ఆత్మహత్య చేసుకోకుండా నాకు కాపలా పెట్టాడు. నా ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

నన్ను స్త్రీగా నిరూపించుకోవటం కోసం అను క్షణం నేను ప్రయత్నించేదాన్ని. నాకు అందుబాటులో ఉన్న దుస్తులు,అలంకరణ సామాగ్రితో వీలైనంత వరకు బాలిక వలె అలంకరించుకునేదాన్ని. నేను కంట పడ గానే, నేను మానవుడిని కానట్టూ, విచిత్ర ప్రాణినైనట్టూ అందరి చూపూలూ నన్ను శోధించేవి. సేవకులు నా వెనుక నవ్వుకునేవారు. ఆ నవ్వులు నా గుండెల్లో గుచ్చు కునేవి. అయినా నేను యుద్ధం ఆపలేదు.

ఈ స్థితిలో కూడా నేను ఎంతో ఆసక్తితో విలువిద్య నేర్చుకునేదాన్ని. నేను స్త్రీగా మారిన తరువాత భీష్ముడిని నేను ఆరాధిస్తున్నానని నాకు తెలిసింది. భీష్ముడిని చేరే మార్గం కేవలం విలువిద్య మాత్రమే. నన్ను నేను మరిచి పోవటానికి, భీష్ముడిని చేరటానికి నాకు విలువిద్య ఆసరా అయింది. పురుషుడి శరీరానికుండే శారీరక బలం, స్త్రీ సహజ సిద్ధమైన నైపుణ్యం, రెండూ నాకు వుండటం వల్ల విలువిద్యలో నేను పరిణితి సాధించాను.

నాది ఉన్మత్తతో లేక ఏదైనా మాయ నన్ను ఆవ రించిందో అని భావించిన నా తండ్రి గొప్ప వైద్యులను పిలిపించి నాకు తగిన వైద్యం చెయ్యమని ఆదేశించాడు. వారి వైద్యం నాలో ఎలాంటి మార్పూ కలిగించలేక పోయింది.

నాలాంటి సమూహానికి నాయకత్వం వహిస్తున్న వారిని పిలిపించాడు. నన్ను మామూలు మనిషిని చేస్తే ఎన్నో బహుమతులు యిస్తానని ఆశ పెట్టాడు.

''సామి, మేము శివుడి రూపాలం. మా దీవెన మీకు విజయం కలిగిస్తుంది. అర్ధనారీశ్వరులం. మనసు పార్వతీదేవిది అయితే శరీరం శివుడిది. మనసు శివుడిది అయితే శరీరం పార్వతీదేవిది. శివుడే మీ ఇంట పుట్టా డనుకోండి,'' ఆ నాయకుడు వినయంగా చెప్పాడు.

నా గురించి అందరికీ తెలియకుండా ఎలా దాచి పెట్టాలో నా తండ్రికి అర్థం కాలేదు. ఆంతరంగికులని, జ్యోతిష్కులని పిలిచి తన పరువు కాపాడే దారి వెతక మని ఆదేశించాడు.

అంతా కలిసి ప్రపంచాన్ని నమ్మించే ఒక కథని అల్లారు. నేను పూర్వజన్మలో అంబనని, భీష్ముడిని చంపాలని ప్రతిజ్ఞ చేసి ప్రాణాలు తీసుకొని పురుషుడి శరీరంలో చేరి నా తండ్రికి ఈ జన్మలో పుట్టానని ప్రపం చానికి చాటారు.

కొన్నాళ్లకు నా తల్లి కవల పిల్లలకు జన్మనిచ్చింది. ఒక బాలుడు. ఒక బాలిక జన్మించారు. బాలికను ద్రౌపది అని పిలిచేవారు. నాతో విసిగిపోయిన నా తండ్రి వారిని అల్లారుముద్దుగా పెంచాడు. చిన్ననాటి నుంచే ద్రౌపదిని అర్జునుడికి భార్యను చెయ్యాలని కోరుకునేవాడు.

ద్రౌపది అందానికి ప్రతిరూపం. నల్లటి కళ్లతో మెరిసే వంటితో చూపరులను మైమరిపించేది. ద్రౌపదిని చూసి నాలో నేనే ముడుచుకుపోయేదాన్ని. ఆడవాళ్లు కూడా మోహించే ద్రౌపది సౌందర్యాన్ని, రోమాంచితం అయి, మొద్దుబారి వున్న నా శరీరంతో పోల్చుకుని క్రుంగిపోయేదాన్ని. నా శరీరాన్ని హింసించేదాన్ని. నా శరీరానికుండే పురుష అవయవాలను తొలగించుకోవా లనే ప్రయత్నంలో చాలాసార్లు చావు అంచు వరకు వెళ్లి వచ్చాను.

*

నాకు వివాహం చెయ్యాలని నా తండ్రి నిర్ణయిం చాడు. వివాహం తప్పించుకోవటానికి ఎన్నో ప్రయత్నాలు

చేశాను. ప్రాధేయపడ్డాను, బ్రతిమాలాను, బెదిరించాను. కాని నా మాట వినకుండా వివాహం జరిగితే నేను సరి అవుతానని, బంధుత్వంతో రాజ్యం పటిష్ఠమౌతుందని భావించి, నన్ను బంధించి దశార్ణదేశపు రాజు కూతురితో వివాహం జరిపించారు.

నేను స్త్రీనై మరొక స్త్రీని వివాహమాడవలసి రావడం నేను తట్టుకోలేకపోయాను. కాని నాకు పారి పోవటానికిగాని, ఆత్మహత్య చేసుకోవటానికిగాని దారి లేక ఆ అమాయకురాలి జీవితం అన్యాయం చేశాను.

మొదటి రాత్రి నన్ను, నా వస్త్రధారణనీ చూసిన ఆ పసిపిల్ల మూర్ఛపోయింది. నేను పురుషుడిని కానని ఒక స్త్రీని అని అందరికి చెప్పి, తన తండ్రికి కబురం పింది.

ఆమె తండ్రి మోసపోయినందుకు నా తండ్రిని నిలదీశాడు. అతని వాదనని నా తండ్రి వినిపించు కోలేదు. నన్ను పరీక్షించుకొమ్మన్నాడు. నా శరీరం పరీక్షకు గురైంది. మగ అంగాలున్న నన్ను మగవాడిననే తేల్చారు. నా నడక, నా మాట, నా కదలికలు స్త్రీని తలపిస్తున్నా, నా తండ్రి బలాన్ని, బలగాన్ని చూసి ఎదురాడలేక ఆ అమాయకురాలిని అన్యాయం చేసి దశార్ణదేశపు రాజు వెళ్లిపోయాడు. ఆమె గోడు పట్టించుకున్న వారు లేక చెప్పుకునే నాధుడు లేక ఆ పసిప్రాణం కొట్టుకులాడింది.

ఇంత కఠినమైన మనుషుల మధ్య, యిన్ని అవ మానాలు పొందుతూ వుండలేక దూరంగా వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాను. నా వారసత్వ హక్కుని ఆసరాగా చేసుకుని నా తండ్రిని రాజ్యంలో ఏదైనా ప్రాంతానికి నన్ను రాజుని చెయ్యమని అర్థించాను. నేను స్వతహాగా యోధురాలిని కావడంతో ద్రుపద రాజ్యానికి సుదూరం గా వున్న ఒక చిన్న ప్రాంతాన్ని నాకు అప్పగించాడు నా తండ్రి. నేను, నాకు భార్యని చేసిన ఆ పిల్లని తీసుకోని ఆ రాజ్యానికి చేరాను. ఈ అమరికతో నా తండ్రికి, నాకు, నా భార్యకు సాంత్వన దొరికింది. నేను రాజుని కనుక నాకు నచ్చిన విధంగా వుండే అవకాశం దొరకింది. నన్ను నేనుగా గుర్తించుకున్న నాటినుంచి కొంతైనా నాలాగ బతకటానికి దొరికిన అవకాశం ఇది. నా మనసుకు కొంత సాంత్వన దొరికింది.

*

మత్స్యయంత్రాన్ని అర్జునుడు పడగొట్టాడని విని సంతోషపడ్డాను. ద్రౌపది చిన్ననాటి నుంచి అర్జునుడినే భర్తగా భావించి ఆ తలపులతోనే జీవించింది. అర్జునుడి భార్య అవుతున్నందుకు ద్రౌపది పొందే ఆనందాన్ని తలచుకున్నాను.

కుంతి తన కుమారులను సంస్కారవంతులుగా పెంచింది. దాసీలను తాకబోమని వారితో వట్టు వేయించుకుంది. తతిమా నలుగురూ బ్రహ్మచారులుగా వుండగా, అర్జునుడు ఒక్కడే సంసార సుఖాన్ని అను భవిస్తుంటే తన కుమారుల మధ్య అసూయ తలెత్తు తుందని భావించిన కుంతి ద్రౌపదిని ఐదుగురికి భార్యను చేసింది. కాని అయిదుగురితో శరీరాన్ని పంచుకోవటం ఎంత నరకమో...

ఎలా వుందో నా సోదరి. నా మనసు ద్రౌపదిని చూడాలని తహతహలాడింది.

తన వారినందరిని వదిలి ఒక్కరోజులో తన జీవితంలో జరిగిన పెనుమార్పులకు చిగురుటాకులా వణికిపోయింది ద్రౌపది.

నన్ను చూసి కంటతడి పెట్టింది.

"అన్నా, జంతువులైనా తమకు నచ్చిన వాటితో జత కట్టటానికి ముందు మచ్చిక చేసుకుంటాయే, నా బ్రతుకు జంతువు కన్నా హీనం అయింది. అర్జునుడే నా భర్త అని నా మనసంతా నింపుకున్నాను. ఐదుగురితో సంసారం ఎలా చెయ్యాలి. నన్ను గురించి లోకం ఏమనుకుంటుంది," అని హృదయవిదారకంగా విలపిం చింది.

"బాధపడకు తల్లీ. కాలం, అనుభవాలు అన్నిం టినీ ఎదుర్కొనే శక్తిని ఇస్తాయి. లోకం గురించి చింతిం చకు. ఐదుగురు భర్తలున్న నీ గురించి కూడా లోకం మన్నించే ఒక కథ అల్లుతారు. నిన్ను లోకం ఆదరి స్తుంది," అని ఓదార్చాను.

చాలా కాలం ద్రౌపది కన్నీరు నన్ను వెంటాడింది.

*

దుర్యోధనుడు రాజ్యంలో భాగం యివ్వటానికి నిరాకరించటంతో యుద్ధం అనివార్యం అయింది. నేను పాండవుల సర్వాసేనానికి తోబుట్టువునవడంతో నేను కూడా యుద్ధరంగంలో అడుగుపెట్టాను. నా చిరకాల స్వప్నం అయిన భీష్ముడితో తలపడి, నా విలువిద్యా నైపుణ్యంతో భీష్ముడి మనసును గెలుచుకొని లోకానికి నన్ను నిరూపించుకునే ఒక వరంగా ఈ యుద్ధం నా ముందు నిలిచింది.

సైనికులు నా వస్త్రధారణనీ, నా హావభావాలు చూసి నన్ను గేలి చెయ్యటం, వెకిలినవ్వులు నవ్వటం నా దృష్టిని దాటిపోలేదు. ఇలాంటి అవమానాలు ఎన్ని సార్లు ఎదుర్కొన్నా ప్రతిసారి గాయం లోతుకు దిగుతూనే వుంటుంది. కాని నా ముందున్న లక్ష్యాన్ని తలుచుకుని మనసు దిటవు చేసుకున్నాను.

నా యుద్ధరంగం ప్రధాన యుద్ధరంగానికి దూరంగా వుండటం వలన నాకు భీష్ముడు తటస్థపడలేదు. రోజులు గడిచేకొద్దీ భీష్ముడిని ఎదుర్కొనే అవకాశం రాదేమో నన్న నిరాశ మొదలైంది. నిరాశను తరిమి ఓర్పుగా ఎదురుచూడసాగాను. నేను కోరుకున్న రోజు వచ్చింది.

యుద్ధం మొదలైన తొమ్మిదవరోజు రాత్రి నా సోదరుడు నా దగ్గరకు వచ్చి తర్వాత రోజు జరగబోయే యుద్ధంలో భీష్ముడిని ముఖాముఖి ఎదుర్కొనబోయేది నేనేనని, నాకు రక్షణగా అర్జునుడు కుడా నా రథం మీదనే ఉంటాడని చెప్పి వెళ్లాడు.

నాకు ఆ రాత్రి నిదుర కరువైంది. చిన్ననాటి నుంచి నేను ఎదురుచూసిన క్షణం నా ముందుకు నడచి వచ్చింది. నేను ఆరాధించి, గురువుగా భావించిన భీష్ముడి దగ్గర నా విద్యని ప్రదర్శించే అవకాశం వచ్చింది. ఈ యుద్ధంలో నేను మరణించినా నేను బాధపడను.

భీష్ముడిని ఎదుర్కునే క్షణం కోసం ఆత్రుతతో ఎదురుచూడసాగాను.

*

ఇరువైపులా సైనికులు మోహరించి వున్నారు. నేను, అర్జునుడు ఒకే రథాన్ని అధిరోహించి వున్నాం. యుద్ధం మొదలైంది. కృష్ణుడు రథాన్ని భీష్ముడి రథానికి అభిముఖంగా తీసుకువెళ్లాడు. నా చుట్టూ వున్నవాళ్లు నన్ను ఉత్సాహపరుస్తున్నారు. భీష్ముడిని చంపటానికే పుట్టావు. ఈరోజు ఆ కార్యం పూర్తి చేయ్యమని పలు రకాల కేకలు వినిపిస్తున్నాయి.

''అదుగో భీష్ముడు,'' నా చెవిలో అర్జునుడి మాటలు ప్రతిధ్వనించాయి. అర్జునుడు చూపించిన వైపు చూశాను. ఒక యోగిలాగా జీవితాన్ని గడిపి, కనీసం దాసిని కుడా తాకని పరమ నిష్టాగరిష్టుడైన భీష్ముడు నా కళ్ల ముందున్నాడు. ఆయుధం ప్రయోగించమని అర్జునుడు తొందరపెట్టాడు. వింటి నారిని సవరించి అమ్ములపొది నుంచి బాణాన్ని తీసి భీష్ముడి వైపు ఎక్కుపెట్టాను.

ఉద్వేగంతో నా శరీరం కంపిస్తుంది. నా గుండె చప్పుడు నాకు వినిపిస్తుంది. స్వేదం నా శరీరాన్ని తడిపి వేస్తుంది.

ఇంతలో ఏదో గందరగోళం చెలరేగింది. ''భీష్ముడు యుద్ధం చెయ్యడంట,'' అన్న సైనికుల అరుపులు లీలగా వినిపించాయి. నెమ్మదిగా తేరుకుని భీష్ముని వైపు చూశాను.

భీష్ముడు ఎదురుగావున్న నన్ను చూసి, ''పేడితో యుద్ధం చెయ్యను,'' అని ఆయుధం విసర్జించాడు.

అప్పుడు నేను పూర్తిగా మరణించాను. నేను కొలిచిన భీష్ముడు నన్ను మనిషిగా గుర్తించక, నాతో యుద్ధాన్ని నిరాకరించాడు. యుద్ధంలో ఎన్నో గుర్రాలను, ఏనుగుల్ని చంపి వుండవచ్చు. నన్ను అలా చంపినా నేను తృప్తిపొందేదాన్ని. నన్ను ఒక ప్రాణిగా గుర్తించ నిరాకరించిన భీష్ముడు, ద్రౌపదిని వస్త్రాపహరణం చేసి, కుంతి మాతృత్వాన్ని అవమానించి, ఎన్నో అన్యాయాలు చేసిన వారివైపు నిలబడి యుద్ధం చేస్తున్నాడు. నేను వారిపాటి చెయ్యనా? ఇదేనా న్యాయం? నా నైపుణ్యంతో, నా బుద్ధివికాసంతో నన్ను గుర్తించకుండా నేను స్త్రీనో, పురుషుడినో కానందుకు నన్ను నిరాకరించాడు. భీష్ముడి నుంచి ఆ నిరాకరణని, ఏహ్యాభావాన్ని నా మనసు తట్టుకోలేకపోయింది. నేను విలువిద్యలో తనకు సరిసమానం అని, నన్ను మనిషిగా గుర్తించి నాతో యుద్ధం చెయ్యమని భీష్ముడిని వేడుకోవాలని వుంది. మానవత్వంలో, బుద్ధిలో, శక్తి సామర్థ్యాలలో అక్కడ యుద్ధం చేస్తున్న ఎవరికీ తీసిపోనని గొంతెత్తి అరవాలని వుంది. గొంతు తెగిపోయేలా ఏడవాలని వుంది. కాని నా నోరు పెగలలేదు.

నా హృదయం ఘనీభవించింది. నాలో జీవేచ్ఛ మరణించింది. అచేతనంగా వున్న నన్ను చూసిన అర్జునుడు అదను చూసి భీష్ముడిపై బాణాలు సంధించాడు.

*

నా మరణం సంపూర్ణమైంది.

*తెలుగు వెలుగు మాసపత్రిక, 5 అక్టోబర్ 2014*

